# 10. మరో బొమ్మ

"వెళ్ళండి, ఫర్వాలేదు, ఇక్కడంతా యింతే!—" అన్నాడు రిక్షావాడు, రిక్షా ఆపిన తర్వాత దిగిన భాస్కరంతో.

భాస్కరం ఒకసారి సంకోచంగా ఆ 'ఇక్కడ'కేసి చూశాడు—మసక మసక వెలుగును ప్రసరిస్తున్న వీధి లైట్లు, ఎంతో కాలంగా వెల వెల పోయినట్లుగా ఉన్నాయి. 'ఇక్కడ' జీవితాలకు యింతకన్నా వెలుగు అనవసరం ఏమో అన్నంత నిర్లిప్తంగా అని వెలుగుతున్నాయి. ఆ మసక వెలుగులలో, ఆ మసక చీకట్లలో, ఆ వెలుగుతున్న చీకట్ల మధ్య అక్కడక్కడ....

భాస్కరం కొంచెం యిబ్బందిగా కదిలాడు. మనసు కొంచెం మరీ చిలిపిగా యిబ్బంది పెట్టింది. ఒళ్ళంతా చిరుచెమటలు. అయినా ఎక్కడినుంచో తెలీని సన్నని మంటలు.

రిక్షావాడు యింకోసారి అన్నాడు—"వెళ్ళండి, మీకేం భయం లేదు.... పోనీ నేను రానా?"

భాస్కరం భయపడ్డాడు.

తన భయాన్ని బలవంతాన్ని కప్పిపుచ్చుకుంటూ అన్నాడు—"వద్దులే, వెళ్లు!" అని. వాడు వెళ్ళడేమోనన్న భయం తన్ను వెంటాడుతోంటే, త్వర త్వరగా జేబులోంచి రూపాయి నోటు తీసి అందించాడు.

రిక్షావాడు అ నోటు అందుకొని, వెళ్ళిపోయాడు.

భాస్కరం మరోసారి ఆ వీధిలోకి చూశాడు - అతనికి రెండు రోజులక్రితం జరిగిన సంఘటన గుర్తొచ్చింది ...

ఆ రోజు శనివారం. భాస్కరానికి శనివారాలు వుండటం చాల కాలంనుంచి అలవాటు అయిపోయింది. భక్తి శ్రద్ధలు, దైవచింతన అంతగా లేకపోయినా వారానికి ఒక పూట జీర్ణకోశానికి కొంచెం విశ్రాంతి యివ్వటం మంచిది అనే ఊహతో శనివారం సాయంత్రం పూట అభోజనం వుండటం, వీలుంటే, టైముంటే వెళ్లి ఏ దేవుణ్నో సందర్శించిరావటం భాస్కరం అలవాటు చేసుకొన్నాడు.

భాస్కరం చేస్తున్నది మెడికల్ రిప్రజెంటేటివ్ ఉద్యోగం. ఆ ఉద్యోగంలో నియమ నిష్టలతో వుండటం కష్టమైన పని. ఎక్కడ ఏది పడితే అది తిని, ఎలా పడితే అలా ఉండగలిగేవాడు ఆ ఉద్యోగానికి బాగా పనికొస్తాడు. భాస్కరం అలాంటి ఉద్యోగంలో కూడ సాధ్యమైనంతగా జాగ్రత్తగానే వుంటున్నాడు. శనివారంపూట - తన ఆశయమూ, దైవ భక్తీ కలిసివచ్చేలాగున అభోజనం ఉండటం, దైవ సందర్శనమూ అలవాటు చేసుకొన్నాడు.

ఆ రోజు అలాగే ఆంజనేయస్వామి గుడికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. గుడి అంతా రద్దీగా వుంది. భాస్కరానికి గుడి అంటే ప్రశాంతంగా వుండాలనిపిస్తుంది. కానీ గుళ్లో జనం వుంటే, అదంతా, ఎంతో అలజడి కలిగిస్తుంది భాస్కరానికి. మనసంతా ప్రశాంతత బదులుగా అదోరకం ఆందోళన నిండిపోయింది.

పరాకుగా నడుస్తున్నాడు భాస్కరం - తన పక్కనే ఎవరో నడుస్తూ ఉండటం కూడా గమనించగలిగే స్థితిలో లేడతను.

క్షణం తర్వాత....ఎవరో ఏదో అన్నట్లుగా అనిపించి అటుకేసి చూశాడు భాస్కరం. తన్ను అంటిపెట్టుకుని ఉన్నట్లుగా వున్న అతను మెమ్మదిగా అన్నాడు - "కావాలా సాబ్ ? కొత్త సరుకు...."

భాస్కరానికి యిలాటి అనుభవం కొత్త. ఆ కొత్తదనం యింకా అతనిలో చలిపిదనాన్ని కలుగజేయలేదు. అందుకే అడిగాడు—

"ఏమిటీ ?"

"అమ్మాయి సార్....చాలా చిన్నది....పదిహేడేళ్లే...."

భాస్కరానికి అసహ్యం అనిపించింది – ఛీ – ఇంతకీ వీడు చెప్పేది యిదా ? ఇంత బహిరంగంగానా ?....' దేశమా, ఎక్కడికి పోతున్నావు నువ్వు ? ఆడతనాన్ని ఇంత ఘోరంగా ఇలా బజార్లలో....ఛీ ' అని అనుకున్నాడు భాస్కరం.

ఆ వ్యక్తికి జవాబు యివ్వక నడవసాగాడు భాస్కరం. భాస్కరంతో బాటుగా రెండడుగులు వేసిన అతను యిక లాభంలేదనుకొని ఆగిపోయాడు.

భాస్కరం హోటల్ రూంకు చేరుకున్నాడు – అయినా అతని మనసులోంచి ఆ సంఘటన తొలగిపోలేదు.

రాత్రి అంతా మనసు మంచీ చెడుల మధ్య ఊగిసలాడింది.

శరీరం ఆ అనుభం కోసం ఆక్రోశిస్తోంటే మనసు అడ్డుపడింది – అతను ఆ రోజు ఎన్నో సంఘర్షణలకు లోనయాడు.

మర్నాడు ఆదివారం. ఆదివారం రోజు ప్రొద్దున్నంతా భాస్కరానికి బోలెడంత పని. డాక్టర్లంతా ఆదివారం ఉదయం అంతా ప్రజల రోగం కుదిర్చి, సాయంత్రాలు మాత్రం తమకోసం కేటాయించుకుంటారు. అందుకని భాస్కరం ఆదివారం ఉదయం ఆ డాక్టరు దగ్గరకు వెళ్ళి ఆ మందు కొనమని, ఈ డాక్టరు దగ్గరకు వెళ్ళి ఈ మందు కొనమని, డాక్టరు దగ్గరనుంచి డాక్టరు దగ్గరకు రోగం లేక పోయినా తిరుగుతాడు. ఆ తిరుగుడులో అతనికి మరే సంగతి గుర్తుండదు. ఎంతసేపూ మంత్లీ రిటర్న్సు, సాంపుల్స్, స్టాటిస్టిక్సూ .... బిజినెస్ ఇంతే....

ఆదివారం సాయంత్రం-ఆదివారం సాయంత్రం అతనికి శనివారం సాయంత్రమే గుర్తొచ్చింది. ఆదివారం అంతక్రితం ఎప్పుడూ వెళ్లక పోయినా మళ్లీ గుడికి వెళ్ళాడు. గుళ్లొంచి ఎవరో తరిమేసినట్లుగా తిరిగి వచ్చాడు.

తిరిగి వచ్చేటపుడు, నిన్న కనిపించిన 'ఆ వ్యక్తి' కోసం వళ్లంతా కళ్లు చేసుకొని వెదికాడు. అయినా లాభం లేకపోయింది. చివరకు నిరాశతో హోటల్ బెడ్ మీద వాలాడు.

కంటి కెదురుగా ఎన్నో ఇబ్బందులు—శరీరం పడుతున్న కోతలు.

మర్నాడు ఎంతో ధైర్యం చేసి రిక్షా ఎక్కాడు. రిక్షా ఎక్కగానే అడిగాడు—"ఏదైనా సరుకు కావాలా!" అని.

అలా అడిగీ అడగ్గానే అతనే ఆశ్చర్యపోయాడు, అలా అడిగింది తననేనా అని !

రిక్షా కదిలింది.

భాస్కరం వీధిలోకి కదిలాడు—అడుగులో అడుగు వేసుకొంటూ, రాబోయే ఆ అనుభవంకోసం!

ఆ వీధిలోకి నాలుగు అయిదు అడుగులు వేశాడో లేదోకానీ, అతనికి కొంచెం ధైర్యం కలిగింది—మరో నాలుగైదు అడుగులు వేయగానే, అతనికి తలుపు వారల నిలబడ్డ 'కన్య' లు కనబడ్డారు. అలా ఇంకొన్ని అడుగులు వేశాడు—అతని మనసంతా హఠాత్తుగా ఖాళీ అయిపోయింది.

ఆ వీధిలోకి అతనెందుకు అడుగుపెట్టాడో తలుచుకోగానే అతని వళ్లంతా సిగ్గుతో ముడుచుకు పోయింది. తన రాకకు కారణం అంత మంది స్త్రీలకు తెలిసిపోయిందంటే మరీ ఇబ్బందిగా ఉంది.

ఇంక ఆ వీధిలో నడవలేక పోయినట్లుగా, అక్కడే ఆగి పోయాడు భాస్కరం.

"రండి" ఎవరో పిలిచారు అతన్ని.

అనాలోచితంగా, అప్రయత్నంగా అటుకేసి నడిచాడు. ఆ ఇంటి మెట్లు ఎక్కుతున్నపుడు అతనికి దిగజారిపోతున్నట్లుగా అనిపించింది. అతనిలో అరగంట క్రితం చిలిపిగా రేగినకోరిక ఆనవాలుకూడా అతనిలో ఈ క్షణంలో లేదు.

లోపలికి రాగానే, ఆ స్త్రీ కేసి చూశాడు భాస్కరం. ఆమెకు దాదాపుగా ఇరవై, ఇరవై రెండేళ్లు ఉంటాయి. మనిషిలో మంచి అందం ఎక్కడో దాక్కుని ఉంది, అది ఆమెలోంచి తొంగి చూస్తోంది. కొంటె తనమూ కనిపిస్తోంది.

భాస్కరం జేబులోంచి డబ్బుతీశాడు.—అతనిలో ఇదంతా ఎవరి కోసమో చేస్తున్నట్లుగానే ఉంది.

ఆ స్త్రీ, అతని చేతిలోంచి ఓ పది రూపాయల నోటు అందుకొంది. భాస్కరం పర్సు మూసేశాడు.

"నా పేరు సావిత్రి...." అంది సావిత్రి.

భాస్కరం వినలేదు. అతను ఎదురుగా ఉన్న అద్దంలోకి చూశాడు. ఆ నిలువుటద్దంలో అతనికి సావిత్రి కనబడింది — సావిత్రి—ఇరవై, ఇరవై రెండేళ్లు— పైట జారింది—జాకెట్....

భాస్కరంలో వణుకు ప్రారంభం అయింది... అతనికి ఆ అద్దంలో సావిత్రి స్థానంలో అతనిభార్య భారతి కనబడింది. భారతి... ఆప్యాయంగా ఆదరంగా, అనురాగంతో తనకేసి చూస్తున్నట్లుగా ...

"తలుపు తియ్యి! .. "అన్నాడు భాస్కరం ఆత్రుతగా.

సావిత్రి ఆశ్చర్యంగా అతనికేసి చూసింది.

భాస్కరం ఆగకుండా తలుపు తీశాడు.

"వెళ్ళిపోతున్నారేం?" సావిత్రి ప్రశ్న.

భాస్కరం విసురుగా బయటకు నడిచాడు. ఆ వీధిలోంచి పూర్తిగా బయటపడ్డాక దీర్ఘంగా ఒకసారి నిట్టూర్చుకొన్నాడు.

కానీ సావిత్రికి భాస్కరం ప్రవర్తన అర్థం కాలేదు.

భాస్కరం మనసులో మెదలిన ఆ మరో బొమ్మ సంగతి సావిత్రికి తెలిసే అవకాశం లేనేలేదు.

[ఆంధ్రసచిత్ర వారపత్రిక]
6-9-74